జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో జాతీయ రహదారిపై రైతుల నిరసన

రుణమాఫీపై రైతన్న కన్నెర్ర

షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 29: అర్హతలున్నా రుణమాఫీ కాని రైతులు గర్జించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తీరును నిరసిస్తూ గురువారం జగిత్యాల, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాలో ధర్నాలు చేపట్టారు. కాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన అఖిలపక్ష మహాధర్నాలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొన్నారు. మొదట మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా 63వ జాతీయరహదారి మీదుగా పాత బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. శాస్త్రి చౌక్ వద్ద రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. నినాదాలతో హోరెత్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందంటూ మండిపడ్డారు. సుమారు గంటన్నరపాటు రైతుల మహాధర్నా చేపట్టగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు రైతుల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా ఇదే జిల్లాలోని మేడిపల్లి లోనూ రైతులు ధర్నాకు దిగారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులు నిరసన తెలిపారు. సర్వర్ డౌన్ కావడంతో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి గ్రామంలో రైతులు ఆందోళనకు దిగారు.

కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: సీపీఎం

సంగారెడ్డి కలెక్టరేట్/బచ్చన్నపేట/రామగిరి, ఆగస్టు 29: ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్లు, మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నల్లగొండ కలెక్టరేట్, భువనగిరి ఆర్డీవో కార్యాలయం, మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

రైతును ముంచిన గజదొంగ రేవంత్

మొదటిపేజీ తరువాయి...

మరే గ్రామంలోనైనా పర్యటిద్దామని.. 100 శాతం రుణమాఫీ అయినట్టు చూపించాలని సవాల్ విసిరారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన హరీశ్‌రావు.. రుణమాఫీ విషయంలో రాహుల్ గాంధీని కూడా రేవంత్ తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. దొంగే దొంగ దొంగా అన్నట్టుగా రేవంత్ వ్యవహారం ఉన్నదని విమర్శించారు. మాఫీ విషయంలో మంత్రులు ఒకలా, సీఎం మరోలా.. పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ అంశంపై రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని.. డిసెంబర్ 9 అని, మార్చి అని, ఆ తర్వాత ఆగస్టు 15 అని చెప్పి ఎందుకు ఇంకా మాఫీ చేయలేకపోయారని నిలదీశారు.

> రాహుల్‌గాంధీ అదానీ వద్దు అంటే రేవంత్‌రెడ్డి అదానీ కావాలని అంటున్నరు. అసలు ఇక్కడ ఉన్నది రాహుల్ కాంగ్రెస్సా? రేవంత్ కాంగ్రెస్సా?
>
> వక్రబుద్ధి ఉంటే అన్నీ వంకరగానే కనిపిస్తయ్. ఓటుకునోటు కేసులో రేవంత్‌కు బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా? రేవంత్‌కు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలె
>
> - హరీశ్‌రావు

రేవంత్ 3 సార్లు పిలిచినా రాహుల్ రాలె

రుణమాఫీ విషయంలో ప్రజలనే కాదు రాహుల్‌గాంధీని కూడా రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. వరంగల్ సభకు రాహుల్‌ను రేవంత్ మూడు సార్లు పిలిచినా ఆయన రావటం లేదని తెలిపారు. రాహుల్‌గాంధీ ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్తే, తాను ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆయనకు స్వాగతం పలికి సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి తీసుకెళ్తానని, రుణమాఫీ అయ్యిందో లేదో తేలుతుందని స్పష్టంచేశారు. రుణమాఫీ పూర్తయితే గ్రీవెన్స్ అవసరం ఎందుకు? అని నిలదీశారు. మాఫీపై తాము నివేదిక ఇస్తే సీఎం పదవిలో ఆయనెందుకు? అని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం పోరాడే బాధ్యతను ప్రజలు బీఆర్ఎస్‌కు ఇచ్చారని, ఆ బాధ్యతను నిర్వర్తిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అని వెల్లడించారు. గతంలో ఓ మీడియా చిట్‌చాట్‌లో విద్యుత్తు బకాయిలను అదానీకి అప్పగిస్తామని రేవంత్ చెప్పారని, ఇదే విషయాన్ని తాము అసెంబ్లీలో అడిగితే తామెక్కడ అన్నామని బుకాయించారని గుర్తు చేశారు.



అసలు రేవంత్ మీడియాతో మాట్లాడేది చిట్‌చాట్ కాదని, చీట్‌చాట్ అని విమర్శించారు.

సీఎంగా ఉండి సుప్రీం తీర్పును తప్పబట్టడమా?

సీఎం స్థాయిలో ఉండి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరమని రేవంత్‌పై హరీశ్ ధ్వజమెత్తారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం, కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీనా? అని సీఎంను ప్రశ్నించారు. సిసోడియాకు బెయిల్ వస్తే ఏఐసీసీ సానుకూలంగా స్పందించిందని, అదే కేసులో కవితకు బెయిల్ వస్తే రాష్ట్ర కాంగ్రెస్ విరుద్ధంగా స్పందిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న కే కేశవరావు కూడా కవిత బెయిల్ విషయంలో సానుకూలంగా స్పందించారని, రేవంత్ మాత్రం వక్రభాష్యం చెప్తున్నారని అన్నారు. బెయిల్‌పై రేవంత్, బండి సంజయ్ వ్యాఖ్యలు ఒకే తీరుగా ఉన్నాయని మండిపడ్డారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందని.. ఈడీ, సీబీఐపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని గుర్తుచేశారు.

తెలంగాణ తల్లికి రూపం ఇచ్చిందే కేసీఆర్

తెలంగాణ తల్లి విగ్రహానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేస్తే మంత్రులు ఎవరు రాలేదని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ తల్లికి రూపం ఇచ్చిందే కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ తల్లి భావనకు రూపం ఇచ్చింది కేసీఆరేనని, తెలంగాణ లేకుండా తెలంగాణ తల్లి రూపం ఎక్కడదని, తెలంగాణను తీసుకవచ్చిందే కేసీఆర్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆనవాళ్లపై రేవంత్‌రెడ్డి నిలబడ్డారని గుర్తుచేశారు.

వాల్మీకి స్కాంపై కాంగ్రెస్ చప్పుడు చేయదేం?

వాల్మీకి స్కాం పట్టపగలు నిలువు దోపిడీ అని హరీశ్ రావు ఆరోపించారు. వాల్మీకి స్కాంతో డబ్బు, కార్లు, బంగారం, మద్యం షాపులకు నేరుగా వెళ్లాయని అన్నారు. తెలంగాణకు చెందిన 9 కంపెనీల అకౌంట్స్‌కు కర్ణాటక వాల్మీకి ప్రభుత్వ సంస్థ నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని, వాల్మీకి స్కాంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. ఈ డబ్బు ఎవరికి వచ్చిందో విచారణకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. ఈ స్కాంపై తెలంగాణ బీజేపీ ఎందుకు స్పందించటం లేదని ఎండగట్టారు. రాష్ట్రంలో ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని, స్కాంపై తెలంగాణలో ఈడీ విచారణ ఎందుకు జరగటం లేదని అనుమానం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, కేంద్రమంతులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కాంపై విచారణ చేయాలని బీఆర్ఎస్ తరపున ఈడీని కలుస్తామని తెలిపారు. రాష్ట్రంలో పౌరసరఫరాల సంస్థపైనా ఈడీ విచారణ జరపాలని, ఎఫ్‌సీఐ కేంద్రం సంస్థ అయినందున దీనిపై కూడా ఈడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

మీడియా ప్రతినిధులతో హరీశ్‌రావు చిట్‌చాట్

ఫోర్త్ సిటీ పేరుతో భూ దందా

హైదరాబాద్ ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలను ఆధారాలతో సహా బయటపెడతామని ప్రకటించారు. కందుకూరులో సర్వే నంబర్ 9లో 385 ఎకరాల ప్రభుత్వభూమిని కొల్లగొడుతున్నారని, తుక్కుగూడలో సర్వే నంబర్ 892/1లో 25 ఎకరాలు పేద రైతుల దగ్గర బినామీల పేరుతో తీసుకుంటున్నారని ఆరోపించారు. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చలామణీ అవుతున్న తమ్ముళ్ల పీఏల పేరు మీద భూములు కొంటున్నారని వెల్లడించారు. వీటన్నింటికీ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ తగ్గిందని, రేవంత్‌రెడ్డి దగ్గర ఉండి డీకే అరుణను గెలిపించారని, మోదీతో మాట్లాడుకొని వచ్చి తెలంగాణలో బీజేపీ ఎంపీలను రేవంత్‌రెడ్డి గెలిపించారని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

> రుణమాఫీ చేస్తామని మోసం చేశామని రేవంత్ అంటున్నరు..
>
> రుణమాఫీ జరగనేలేదని మంత్రులు, ఎమ్మెల్యేలు అంటున్నరు..
>
> ఓ ఎమ్మెల్యే అయితే ఏకంగా అధికారులపై పేపర్లు విసిరేశారు..
>
> రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతున్నదని తుమ్మల చెప్తున్నరు..
>
> మరో 20 లక్షల మందికి రుణమాఫీ చేయాలని ఉత్తమ్ అన్నారు..
>
> ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉన్నదని పొంగులేటి చెప్తున్నరు..
>
> రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతలే తలా ఒక రకంగా మాటలు
>
> కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కూల్చివేతల సర్కార్
>
> హైదరాబాద్ బ్రాండ్‌ను, రైతుబంధును కూల్చివేశారు
>
> వైద్య వ్యవస్థను, కేసీఆర్ కిట్‌ను కూల్చేశారు
>
> పార్టీ ఫిరాయింపులతో ప్రజాస్వామ్యాన్ని కూల్చేశారు
>
> దేవుళ్లపై ఒట్టు వేసి ప్రజల విశ్వాసాలను కూల్చేశారు
>
> గొర్రెల పంపిణీ చేయకుండా గొర్రెల కాపర్ల ఉపాధిని కూల్చేశారు
>
> చేపపిల్లల పంపిణీ చేయకుండా మత్స్యకారుల ఉపాధిని కూల్చారు
>
> - హరీశ్‌రావు

ముందు హైడ్రా ఆఫీసు కూల్చండి

చారిటీ స్టార్ట్ ఫ్రమ్ హోం అనేది సామెత ఉన్నదని, దానిలోభాగంగా ముందుగా హైడ్రా ఆఫీసును కూల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హైడ్రా ఆఫీసు బుద్ధభవన్ నాలా కింద ఉన్నదని, దాన్నీ కూలగొడతారా? రంగనాథ్ ముందుగా తన ఆఫీసును కూలగొట్టుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అని సూచించారు. జీహెచ్ఎంసీ ఆఫీసు నాలా కింద ఉన్నదని, నెక్లెస్‌రోడ్‌లో కమర్షియల్ షాపులు, ఇతర వాణిజ్య భవనాలను కూలగొడతారా? లుంబినీ పార్కు కూడా హుస్సేన్‌సాగర్‌లోనే ఉన్నది.. బోట్స్ క్లబ్, సెయిలింగ్ క్లబ్ ఇలా ఎన్నో హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి.. వాటినీ కూల్చాలని హరీశ్ డిమాండ్ చేశారు. మీరాలం చెరువు, ఉప్పల్, రామాంతపూర్ చెరువుల్లో పెద్దపెద్ద టవర్లు వచ్చాయని, వాటిని కూలగొట్టి వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేయాలంటున్న సీఎం.. అందరికీ ఒకటే రూల్ ఉండాలని, కాంగ్రెస్‌లో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేయాలని సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి ఇంట్లో డ్రైనేజీ నీళ్లు చెరువులోకి వెళ్లడం లేదా? పొంగులేటి ఇంటికి ఏమైనా స్పెషల్‌గా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉన్నదా? అంటూ నిలదీశారు. డ్రైనేజీ నీళ్లు చెరువుల్లోకి పోతున్నాయంటున్న సీఎం.. పరోక్షంగా పొంగులేటిని తిడుతున్నారని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీని గతంలో కూల్చివేశారని గుర్తుచేశారు. హైడ్రా కొందరి భవనాలను వెంటనే కూల్చి, మరికొందరికి సమయం ఇస్తున్నదని.. ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.

విష జ్వరాలకు ముగ్గురి బలి

స్టేషన్ ఘన్‌పూర్/తిరుమలాయపాలెం/హసన్‌పర్తి, ఆగస్టు 29: రాష్ట్రంలో వేర్వేరు చోట్ల విష జ్వరాలతో ముగ్గురు మృతి చెందారు. వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాతపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మాడల్ కాలనీకి చెందిన డీసీఎం డ్రైవర్ కొరిమి ఆంజనేయులు (48), ఖమ్మం జిల్లాలో దమ్మాయిగూడేనికి చెందిన బాలిక మహన్య (6), జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముగుళ్లపల్లి మండలం ముల్కలపల్లికి చెందికి అనుమాల నర్సింహారెడ్డి(13) విషజ్వరాలతో మృతిచెందారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తీవ్ర అస్వస్థత

- మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఎమ్మెల్యే
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నా.. ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటున్నారు. గురువారం ఒక్కసారిగా బీపీ, షుగర్ పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న అభిమానులు కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు దవాఖానకు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మర్సుకోల సరస్వతి ఎమ్మెల్యేను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నిర్లక్ష్యంగా వ్యహరించే వైద్యులపై చర్యలు .. వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించి బాధితుల రక్తనమూనాలు సేకరించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల కట్టడిపై అన్ని జిల్లాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదయ్యే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు రోజువారీ రిపోర్టు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కట్టడిపై హెచ్‌వోడీ, జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని మంత్రి స్పష్టంచేశారు. ఎలీసా టెస్టు చేయకుండా ర్యాపిడ్ టెస్ట్ ద్వారా డెంగ్యూ నిర్ధారణ చేసి ప్రజలను ఆందోళనకు గురిచేసే దవాఖానలను గుర్తించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా అవయవ మార్పిడిపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవరావు, ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్‌కుమార్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి పాల్గొన్నారు.

జ్వరాలతో చస్తుంటే పట్టించుకోరా?

- సర్కార్ దవాఖానల్లో మందుల కొరత తీర్చాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలు జ్వరాలతో చస్తుంటే ప్రభుత్వానికి పట్టింపు లేదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విషజ్వరాలతో ప్రాణాలు కోల్పోయే దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. పాలన గాడి తప్పిందని, ఇందుకు మంచంపట్టిన పల్లెలే నిదర్శనమని చెప్పారు. పల్లెల్లో పారిశుధ్యం పడకేసిందని, ఏ ఊరిలో చూసినా ప్రజలు రోగాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి రెండిండ్లతో ఒకరు వైరల్ ఫీవర్‌తో వణికిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల్లేక, డెంగ్యూ కిట్స్ లేక రోగులు ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లి అప్పుల పాలవుతున్నారని గురువారం ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. 'పడకేసిన పల్లె వైద్యం', 'మంచమెక్కిన మన్యం', 'సీజనల్ వ్యాధులతో జనం విలవిల', 'ఊరంతా విషజ్వరాలే' లాంటి వార్తలను సమైక్య పాలనలో చూసేవాళ్లమని, కాంగ్రెస్ పాలన పుణ్యమా అని ప్రస్తుతం ఏ పత్రికలో చూసినా మళ్లీ ఆ వార్తలే ఇప్పుడు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి విషజ్వరాలు విజృంభిస్తుంటే పాలకులకు చీమకుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తప్పుడు లెక్కలు విడుదల చేస్తూ, విషజ్వరాల కేసులను తక్కువ చేసి చూపడం వల్ల ప్రయోజనం లేదని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి: పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విషజ్వరాల బారిన పడే కుటుంబాల సంఖ్య పెరుగుతుందని, గ్రామాలు, తండాలు, హరిజనవాడల్లో తక్షణమే మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, ములుగు, ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బయ్యారం మండల కేంద్రంలో డీఎంహెచ్‌వోతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

మందులుండవు.. పరీక్షలు చేయరు

- సర్కారు వైద్యం అందనప్పుడు చావమంటరా?
- మహబూబాబాద్ వైద్యాధికారిని ప్రశ్నించిన గ్రామస్థులు

బయ్యారం, ఆగస్టు 29: సర్కారు వైద్యం సరిగా అందడం లేదు.. ప్రభుత్వ దవాఖానల్లో మందులుండవు.. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయరు.. ప్రైవేటుకు పోక ఏం చేయమంటరు? చావమంటరా? అంటూ మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్‌పై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. బయ్యారం మండల కేంద్రంలోని శ్రీరామ, ప్రశాంతి క్లినిక్‌లను, ల్యాబ్‌లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన అనుమతులు లేవని, పరిమితికి మించి వైద్యం చేస్తున్నారని, వాటిని మూసేయాలని నిర్వాహకులను ఆదేశించారు. దీంతో విష జ్వరాలతో వైద్యం చేయించుకునేందుకు అక్కడికి వచ్చిన ప్రజలు ఒక్కసారిగా వైద్యశాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు దవాఖానల్లో మందులుండవని.. రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదని, అందువల్లే తాము ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తున్నదని చెప్పారు. ఈ వైద్యశాలలను మూసి వేస్తే తాము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. బయ్యారం, గంధంపల్లి వైద్యశాలల్లో ల్యాబ్ టెక్నిషియన్లు లేరని, రక్త నమూనాల రిపోర్ట్ వచ్చేందుకు వారం పడుతున్నదని, దీంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తున్నదని మండిపడ్డారు. పల్లె దవాఖానల్లో సైతం మందులు, సిబ్బంది లేకనే మండల కేంద్రాల్లోని వైద్యశాలలకు వస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో సేవలు మెరుగు పరిచి ప్రైవేటుకు పోకుండా కట్టడి చేయాలని సూచించారు.

ఆహార పంట ఉత్పత్తుల్లో మనమే టాప్

- 16.42 శాతం వృద్ధితో దేశంలోనే తెలంగాణ టాప్
- పంజాబ్, హర్యానా రాష్ట్రాలను తలదన్ని అగ్రభాగంలోకి
- సాగుకు జీవం పోసిన కేసీఆర్ వ్యవసాయ పథకాలు
- వెల్లడించిన కేంద్ర నివేదిక



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఆహార పంటల ఉత్పత్తిలో తెలంగాణ మేటిగా నిలిచింది. ఏకంగా 16.42 శాతం వృద్ధి రేటును సాధించిన తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉన్నది. పంజాబ్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి పెద్ద వ్యవసాయ రాష్ట్రాలను వెనక్కి నెట్టి మేటి అనిపించుకున్నది. 2018-19 నుంచి 2023-24 వరకు వ్యవసాయరంగంలో వివిధ రాష్ట్రాలు సాధించిన వృద్ధిరేటుపై నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం ఆహార పంటల ఉత్పత్తి వృద్ధి రేటు పెరుగుదలలో తెలంగాణతో మరే ఇతర రాష్ట్రం కనీసం పోటీలో కూడా నిలువలేకపోయింది. తెలంగాణ 16.42 శాతం వృద్ధి రేటు సాధిస్తే.. 7.11 శాతం వృద్ధి రేటుతో ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర నిలిచింది. అంటే తొలిస్థానంలో నిలిచిన తెలంగాణకు, రెండో స్థానంలో నిలిచిన మహారాష్ట్ర మధ్య తేడా 9.31 శాతం ఉన్నది. మిగిలిన రాష్ట్రాల్లో బీహార్ 5.14శాతం, మధ్యప్రదేశ్ 4.35 శాతం, కర్ణాటక 3.18 శాతం, ఉత్తరప్రదేశ్ 1.65 శాతం, పంజాబ్ 0.66 శాతం, హర్యానా 0.34శాతం, పశ్చిబెంగాల్ 0.14శాతం వృద్ధిరేటును నమోదు చేశాయి.

కాళేశ్వరం.. కేసీఆర్ పథకాలు

ఆహార పంటల ఉత్పత్తుల వృద్ధిరేటులో తెలంగాణ సాధించిన ఈ ఘనతకు వెయ్యి శాతం కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు ఆయన అమలుచేసిన వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ పంట పొలాలకు గోదావరి జలాలను పరుగులు పెట్టించారు మాజీ సీఎం కేసీఆర్. చెరువులన్నీ కాళేశ్వరం జలాలతో నింపడంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు ఉబికివచ్చాయి. రాష్ట్రంలో ఎక్కడా సాగు నీళ్ల కొరత, కరవు అనే మాటే వినిపించలేదు. దీనికితోడు రైతుబంధు పేరుతో పెట్టుబడి సాయాన్ని కూడా అందించారు. రైతుబీమా పథకం ద్వారా బీమా సదుపాయం, సబ్సిడీలో ట్రాక్టర్లను అందించడం, కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు వంటి చర్యలు వ్యవసాయానికి, రైతుకు దన్నుగా నిలిచాయి. దీంతో రైతులు కూడా నిబ్బరంగా వ్యవసాయం చేసి పసిడి పంటలు పండించారు.


తెలంగాణలో పంటల సాగు విస్తీర్ణం
(కోట్ల ఎకరాల్లో..)
2014-15 1.29
2015-16 1.19
2016-17 1.38
2017-18 1.40
2018-19 1.34
2019-20 1.78
2020-21 2.07
2021-22 1.95
2022-23 2